# నేటి పత్రిక ప్రజా వార్త

తెలుగు వారపత్రిక

# NETI PATRIKA PRAJA VARTHA

Telugu Weekly

సంపుటి: 01 | సంచిక : 05 | తేదీ : 8-15 జూన్ 2021 విజయవాడ | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | పేజీలు : 4 | వెల : రూ. 5.00

VOLUME: 01 | ISSUE: 05 | DATE :8 -15 June 2021 VIJAYAWADA | EDITOR:KONDURI SRINIVASARAO | PAGES: 4 | PRICE : RS. 5.00


## 18ఏళ్లు పైబడిన అందరికీ ఉచితంగా టీకా



దిల్లీ, : కరోనా వైరస్‌పై పోరాటంలో కీలక అస్త్రమైన వ్యాక్సినేషన్‌పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న వ్యాక్సినేషన్ విధానంలో మరిన్ని కొత్త మార్పులతో కేంద్రీకృత వ్యాక్సినేషన్ డ్రైవ్ తీసుకొచ్చింది. ఈ నెల 21 నుంచి 18 ఏళ్లు పైబడిన వారందరికీ కేంద్రమే ఉచితంగా టీకాలు పంపిణీ చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్రమే టీకాలు కొనుగోలు చేసి రాష్ట్రాలకు ఇస్తుందని.. రాష్ట్రాలు రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. దేశంలో కరోనా సెకండ్ వేవ్ కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. కొవిడ్ వ్యాక్సినేషన్ బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనన్నారు. వ్యాక్సినేషన్‌పై అనేకసార్లు సీఎంలతో మాట్లాడానన్న ప్రధాని.. టీకా కొరతపై అనేక రాష్ట్రాలు కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నాయని చెప్పారు. వ్యాక్సిన్ల కొరతపై రాష్ట్రాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. టీకాల భారం నుంచి రాష్ట్రాలకు పూర్తి విముక్తి కల్పిస్తున్నట్టు మోదీ ప్రకటించారు. 75శాతం టీకాలు కేంద్రమే సేకరించి రాష్ట్రాలకు పంపిణీ చేస్తుందని ప్రధాని స్పష్టంచేశారు.

నవంబర్ నాటికి 80శాతం మందికి వ్యాక్సినేషన్

“ఈ నెల 21 నుంచి ఉచిత టీకా ప్రక్రియ చేపట్టి నవంబర్ నాటికి 80 శాతం మందికి వ్యాక్సినేషన్ పూర్తి చేస్తాం. సొంత ఖర్చుతో టీకా వేసుకొని వారికి ప్రైవేటులో అవకాశం ఉంటుంది. టీకాల్లో 25శాతం ప్రైవేటు రంగానికి అందుబాటులో ఉంటాయి. గరిష్ఠంగా రూ.150 సర్వీస్ ఛార్జితో ప్రైవేటులోనూ టీకా వేసుకోవచ్చు”

ఆక్సిజన్ ఉత్పత్తి 10రెట్లు పెంచాం

“ప్రపంచంలోని అన్ని దేశాలూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఆధునిక కాలంలో ఇలాంటి ఈ తరహా మహమ్మారిని ఎప్పుడూ చూడలేదు. కరోనా సెకండ్ వేవ్‌తో దేశం కఠిన పోరాటం చేస్తోంది. కరోనా వల్ల ఎంతోమంది ఆప్తులను కోల్పోయారు. గత వందేళ్లలో ఇదే అతిపెద్ద మహమ్మారి. ఇలాంటి మహమ్మారిని గతంలో (మిగతా 2వ పేజీలో)

## వార్డుల అభివృద్ధికి ఎంత ఖర్చయినా వెనుకాడొద్దు: సీఎం జగన్

అమరావతి , నేటి పత్రిక ప్రజా వార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా వైరస్ నివారణ చర్యలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా.. గర్భిణులు, చిన్నపిల్లల కోవిడ్ చికిత్సపై సీఎం జగన్ దృష్టి సారించారు. యుద్ధ ప్రాతిపదికన పిల్లల వార్డుల అభివృద్ధికి, మెడికల్ కాలేజీల్లో పీడియాట్రిక్ వార్డుల అభివృద్ధికి ఆదేశించారు. వార్డుల అభివృద్ధికి ఎంత ఖర్చయినా వెనుకాడొద్దని స్పష్టం చేశారు.అత్యుత్తమ పీడియాట్రిక్ కేర్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. చిన్నపిల్లల కోసం 3 కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, విశాఖ, కృష్ణా-గుంటూరు, తిరుపతి ప్రాంతాల్లో పీడియాట్రిక్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దాదాపు రూ.180 కోట్ల చొప్పున ఒక్కో ఆస్పత్రి నిర్మాణానికి.. ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.



## ఏపీలో ఈనెల 20 వరకు కర్ఫ్యూ పొడిగింపు



అమరావతినేటి పత్రిక ప్రజా వార్త :కోవిడ్ నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉన్న కర్ఫ్యూను పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూన్ 20 వరకు కర్ఫ్యూను పొడిగించింది. జూన్ 10 తర్వాత ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు కర్ఫ్యూ సడలింపు సమయం పెంచారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రభుత్వ కార్యాలయాలు పని చేయనున్నాయి.కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. సమీక్షకు డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కర్ఫ్యూ గడువు ఈ నెల 10తో ముగియడంతో ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం వైఎస్ జగన్.. మరో పది రోజులపాటు కర్ఫ్యూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## 5 ఏళ్లలోపు పిల్లల తల్లులకు వ్యాక్సిన్



**-రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్**

**-రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల లోపు తల్లులు ఉన్నట్లు అంచనా**

**-45 ఏళ్లు పైబడిన వారితో వ్యాక్సిన్**

**-రాష్ట్రంలో 3 చోట్ల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం**

**-రీజియన్ల వారీగా విశాఖ, తిరుపతి, విజయవాడ/గుంటూరులో ఏర్పాటు**

**-144 సెక్షన్, కర్ఫ్యూ పొడిగింపుతో కరోనా తగ్గుముఖం : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి**

అమరావతి,నేటి పత్రిక ప్రజా వార్త :: కరోనా థర్డ్ వేవ్ వస్తుందన్న నిపుణుల సూచనలతో ముందు జాగ్రత్తతో రాష్ట్ర వ్యాప్తంగా 5 ఏళ్లలోపు పిల్లలు ఉన్న తల్లులకు వ్యాక్సిన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. రాష్ట్రంలో విశాఖ, తిరుపతి, విజయవాడ/గుంటూరులో మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నెల 20 వ తేదీ వరకూ కర్ఫ్యూను రాష్ట్ర ప్రభుత్వ పొగించిందన్నారు. 144 సెక్షన్ ను ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకూ పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన 24 గంటల్లో 64,800 శాంపిళ్లు పరీక్షించగా, 4,872 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, 86 మృతి చెందారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,729 ఐసీయూ బెడ్లు, 8,837 ఆక్సిజన్ బెడ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కొవిడ్ కేర్ సెంటర్లలో 11,035 మంది చికిత్స పొందుతున్నారని, గడిచిన 24 గంటల్లో 1,311 మంది డిశ్చార్జి కాగా, 603 మంది అడ్మిషన్ పొందారన్నారు. 104 కాల్ సెంటర్ కు గడిచిన 24 గంటల్లో 2,597 ఫోన్ కాల్స్ రాగా, వాటిలో అడ్మిషన్లకు 366 కాల్స్, వివిధ సమాచారాలకు 1,221 కాల్స్ వచ్చాయన్నారు. సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ హోం ఐసోలేషన్ లో చికిత్స పొందుతున్న 5 లక్షల మందికి 5 వేల మంది వైద్యులు టెలీ కాల్ మెడిసిన్ సెంటర్ ద్వారా ఫోన్లు చేశామన్నారు. గడిచిన 24 గంటల్లో 17,646 మంది ఫోన్ చేసి, వారి ఆరోగ్య పరిస్థితులుపైనా, మందుల వినియోగంపైనా సలహాలు సూచనలు అందజేశారన్నారు.

కరోనా నివారణకు 144 సెక్షన్, కర్ఫ్యూ పొడిగింపు...

రాష్ట్రంలో కరోనా కేసుల వ్యాప్తి నివారణకు విధించిన 144 సెక్షన్, కర్ఫ్యూను జూన్ 20 వతేదీ వరకూ పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నెల 11 వ తేదీ నుంచి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ 144 సెక్షన్ పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. కర్ఫ్యూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు గంటల వరకూ కర్ఫ్యూ విధిస్తూ... ఇదివరకటి నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసిందన్నారు. మరికొద్ది రోజులు కర్ఫ్యూ పొడిగిస్తే మరింత సత్ఫలితాలు వస్తాయని భావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం(మిగతా 2వ పేజీలో)

## భారీ అగ్ని ప్రమాదం.. 12 మంది సజీవ దహనం?



ముంబై, నేటి పత్రిక ప్రజా వార్త : పుణెలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో దాదాపు 12 మంది సజీవదహనం అయినట్లు సమాచారం. ఆ వివరాలు.. పుణెలోని ఘోటావాడే ఫటాలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో సోమవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఘటన చోటు చేసుకున్న సమయంలో ఫ్యాక్టరీలో 37 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. ఈ ప్రమాదంలో 12 మంది మరణించినట్లు తెలుస్తోంది.ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. 20 మంది కార్మికులను కాపాడారు. కొంతమంది కార్మికులను బయటకు తీసుకురావడం కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం సంభవించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## కిమ్స్ లో మృతదేహాలు తారుమారు







**-కిమ్స్ లో మృతదేహాలు తారుమారు**

**-ఆందోళన చేపట్టిన బాధితులు**

**-బాధితుల తరుపున ఎమ్మెల్యే రాపాక**

తూర్పుగోదావరి, నేటి పత్రిక ప్రజా వార్త ::తూర్పుగోదావరి జిల్లా అమలాపురం కిమ్స్ లో మృత దేహాలు తారుమారు అయ్యాయి.ఒక మృత దేహానికి మరొకరు అంత్య క్రియలు చేయడంతోతమ మృత దేహం తమకు అప్పగించాలని మరో వర్గం అందోళనకు దిగింది. ఈ సంఘటనకు సంబంధించినవివరాలు యిలా ఉన్నాయి.రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి గంజి విజయకుమార్ (45) పది రోజుల క్రితం కిమ్స్ ఆసుపత్రి లో కరోనా తో జాయిన్ అయ్యారు.. అదే విధంగా పి గన్నవరం మండలం మొండెపు లంక కు చెందిన ఈమ్మని వెంకట దుర్గా రావు (65)కూడా కిమ్స్ ఆసుపత్రి లో కరోనా చికిత్స నిమిత్తం జాయిన్ అయ్యారు.. ఆదివారం రాత్రి ఇరువురు మృతి చెందారు.. వారి మృత దేహాలను మార్చురీలో భద్రపరిచారు.. సోమవారం దుర్గారావుకు చెందిన బంధువులు ఆసుపత్రి వచ్చి దుర్గా రావు మృత దేహం అప్పగించాలని కోరారు. ఆసుపత్రి నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. దుర్గారావు మృతదేహానికి బదులు విజయకుమార్ మృత దేహాన్ని వారికి అప్పగించారు. దాంతో వారు అమలాపురం స్మశాన వాటికకు తీసుకు వెళ్ళి దహన కార్యక్రమాలు నిర్వహించుకుని మొండెపు లంక వెళ్లిపోయారు..

## 30 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందజేసిన ప్రైవేట్ బస్ ఆపరేటర్స్ సంఘం



విజయవాడ,నేటి పత్రిక ప్రజా వార్త :ప్రాణవయువు అవసరమైన కరోనా రోగులకు ఆక్సిజెన్ అందించాలనే సత్ శంకల్పంతో తమవంతు సహాయం గా 30 ఆక్సిజెన్ కాన్సంట్రేటర్లు రాష్ట్ర ప్రైవేట్ బస్ ఆపరేటర్స్ సంఘం విరాళంగా అందజేసింది. ఈ మేరకు సోమవారం, విజయవాడ లోని అలపాటి రామారావు ఫంక్షన్ హాల్లో రాష్ట్ర రవాణా, సమాచార శాఖా మంత్రి పేర్ని నాని, పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, జోగి రమేష్ ల చేతులమీదుగా అందజేశారు. ప్రణవయువు అందక కరోనా పై పోరులో ప్రజలందరు కలసి రావాలని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్ ఇచ్చిన పిలుపుకు స్పందించి రాష్ట్ర ప్రైవేట్ బస్ ఆపరేటర్ల సంఘం వారు 12.5 లక్షల వ్యయంతో 30 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు విరాళంగా అందజేయడం పట్ల ప్రైవేట్ బస్ ఆపరేటర్స్ సంఘం నేతలను మంత్రులు అభినందించారు.ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సీఎం జగన్ పిలుపు మేరకు సహృదయంతో స్పందించి, ఏజెన్సీ ప్రాంతాలైన విజయనగరం జిల్లా కురుపాం, చిన మేరంగి, భద్రగిరి ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలకు ఈ ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందించనున్నట్లు మంత్రులు తెలిపారు.



# థియేటర్స్ తెరుచుకున్న వెంటనే సినిమా రిలీజ్ అంట!



ఈ మధ్యకాలంలో తెలుగు ఇండస్ట్రీ కొత్త జానర్లకు – వైవిధ్యమైన సినిమాలకు తావిస్తుంది. ఇప్పుడు వస్తున్నటువంటి నూతన దర్శకులు కొత్త కథలు కథనాలతో సినిమాలు రూపొందిస్తున్నారు. అయితే తెలుగు ఇండస్ట్రీకి 'నీది నాది ఒకే కథ' అనే సినిమాతో దర్శకుడుగా కెరీర్ ప్రారంభించాడు వేణు ఊడుగుల. మొదటి సినిమానే మంచి విజయం సాధించి విమర్శకుల నుండి ప్రశంసలు తీసుకొచ్చింది. ఇప్పుడు వేణు దర్శకత్వంలో సెకండ్ మూవీగా విరాటపర్వం రూపొందించాడు. స్టార్ యాక్టర్స్ రానా – నేచురల్ బ్యూటీ సాయిపల్లవి హీరో హీరోయిన్స్ గా నటించిన ఈ సినిమా షూటింగ్ ముగించుకొని విడుదలకు సిద్ధంగా ఉంది. కానీ తీరా విడుదల సమయానికి కరోనా కారణంగా బ్రేక్ పడింది.కరోనా మహమ్మారి వలన థియేటర్స్ మూతపడి సినిమా రిలీజ్ వాయిదా పడింది. ఒకే వాయిదా పడింది త్వరలోనే మరో డేట్ తో ప్రేక్షకుల ముందుకు వస్తుందిలే అనుకునే లోపల విరాటపర్వం సినిమా డిజిటల్ రిలీజ్ కాబోతుందని పుకార్లు విపరీతంగా వైరల్ అయ్యాయి. ఆ మధ్యలో హీరోయిన్ సాయిపల్లవి పుట్టినరోజు నుండి పుకార్లు మరింత జోరందుకున్నాయి. కానీ అప్పటికే విరాటపర్వం మేకర్స్ ఈ సినిమా పై వస్తున్నా పుకార్లకు చెక్ పెట్టేసారు. విరాటపర్వం సినిమా ఖచ్చితంగా థియేట్రికల్ అవుతుందని క్లారిటీ ఇచ్చారు. విరాటపర్వం థియేట్రికల్ రైట్స్ తో పాటుగా డిజిటల్ రైట్స్ – తెలుగు సాటిలైట్ రైట్స్ – హిందీ డబ్బింగ్ రైట్స్ అన్నికూడా డిస్ట్రిబ్యూటర్ లకు అమ్ముడైనట్లు మేకర్స్ తెలిపారు.అలా సినిమా థియేట్రికల్ రిలీజ్ అవుతుందని క్లారిటీ ఇచ్చేసారు. అయితే రిలీజ్ ముందే సినిమా హక్కులే మేకర్స్ కు లాభాలు తెచ్చిపెట్టినట్లు తెలుస్తుంది. ఈ సినిమా థియేట్రికల్ రైట్స్ వరంగల్ శ్రీను దక్కించుకున్నాడు. అలాగే సినిమా రిలీజ్ డేట్ కూడా కరోనా పరిస్థితి తొలగిపోయాక చెబుతామని తెలిపారు. ఈ సినిమా 1990 కాలంనాటి నక్సలైట్ల జీవితాల ఆధారంగా పీరియాడిక్ సోషల్ మూవీగా రూపొందింది. తాజాగా ఈ సినిమాను జులైలో థియేటర్స్ ఓపెన్ కాగానే ఫస్ట్ రిలీజ్ చేస్తారని సమాచారం. ఈ సినిమాలో ప్రియమణి నివేత పేతురాజ్ నందిత దాస్ ప్రధానపాత్రలలో నటించారు. సురేష్ ప్రొడక్షన్స్ తో పాటు ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్స్ పై సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఆ స్పెషల్ ఐపీఎస్ ఆఫీసర్ మన మహేష్ ఫ్యాన్



టాలీవుడ్ స్టార్ హీరోలకు బాలీవుడ్ సెలబ్రెటీ ఫ్యాన్స్ చాలా మందే ఉంటారు. మహేష్ బాబు అంటే ఇష్టమంటూ చాలా మంది ఉత్తరాది ముద్దుగుమ్మలు చెప్పిన సందర్భాలు ఉన్నాయి. సౌత్ స్టార్స్ కు చాలా మంది నార్త్ లో అభిమానులు ఉండటం ఈమధ్య మరీ కామన్ అయ్యింది. గుజరాత్ కు చెందిన ఒక యువ ఐపీఎస్ ఆఫీసర్ కు మహేష్ బాబు అంటే ప్రత్యేకమైన అభిమానమట. మహేష్ బాబు సినిమాలు చూసింది తక్కువే అయినా కూడా ఆయన చేసిన కార్యక్రమాల వల్ల తాను అభిమానిగా మారానంటూ ఆ ఐపీఎస్ ఆఫీసర్ పేర్కొన్నారు.గుజరాత్ లోని ఒక మారు మూల పల్లెకు చెందిన సఫిన్ హసన్ 22 ఏళ్ల వయసులోనే ఐపీఎస్ గా బాధ్యతలు చేపట్టారు. దేశంలోనే అతి చిన్న ఐపీఎస్ గా నిలిచిన సఫిన్ ఇటీవల ఇన్ స్టాగ్రామ్ చిట్ చాట్ లో మహేష్ బాబు పై తన అభిమానంను చాటుకున్నాడు. తన ఫాలోవర్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన సఫిన్ అభిమాన హీరో గురించి మాట్లాడుతూ మహేష్ బాబు వ్యక్తిత్వం పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.మహేష్ బాబు తెలుగు రాష్ట్రాల్లో రెండు గ్రామాలను దత్తత తీసుకుని వాటిని అభివృద్ధి చేయడంతో పాటు వెయ్యి మందికి పైగా చిన్నారులకు గుండె ఆపరేషన్ చేయించారు. ఇంకా పలు కార్యక్రమాలను నిర్వహించిన మహేష్ బాబు అభిమానులు కూడా ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కరోనా సమయంలో కూడా మహేష్ బాబు అభిమానులు పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. తను దత్తత తీసుకున్న గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కూడా మహేష్ బాబు నిర్వహించారు. ఇక ఆయన సినిమాల్లో కూడా ఏదో ఒక మెసేజ్ ఉంటుంది. అందుకే ఆయన్ను ఉత్తరాది వారు కూడా అభిమానిస్తారు. ఇప్పుడు ఆ జాబితాలో యంగ్ ఐపీఎస్ ఆఫీసర్ సఫిన్ హసన్ చేరాడు.

# మహేష్ తో త్రివిక్రమ్ మూవీ.. మొదలయ్యేది అప్పుడే..నా??



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు – అగ్రదర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో ముచ్చటగా మూడో సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఇదివరకు వీరి కాంబినేషన్ లో అతడు ఖలేజా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ రెండు సినిమాలు కమర్షియల్ గా హిట్ కాలేకపోయాయి. కానీ ప్రేక్షకులకు మాత్రం ఆల్ టైం ఫేవరేట్ మూవీస్ లిస్టులో స్థానం పొందాయి. ప్రస్తుతం డైరెక్టర్ త్రివిక్రమ్.. అరవిందసమేత – అలవైకుంఠపురంలో లాంటి సూపర్ హిట్ సినిమాలతో ఫామ్ లో ఉండగా.. అటు మహేష్ బాబు వరుసగా విజయాలతో మరో బ్లాక్ బస్టర్ కోసం సిద్ధంగా ఉన్నాడు.ఇద్దరూ సూపర్ ఫామ్ లో ఉండేసరికి ఈ కాంబినేషన్ పై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఎందుకంటే త్రివిక్రమ్ – మహేష్ కాంబో వెండితెర పై సూపర్ హిట్ కాకపోయినా టీవీ ప్రేక్షకులకు పై మాత్రం మంచి ఫీస్ట్ మూవీస్ అయ్యాయని చెప్పవచ్చు. అయితే తాజాగా వీరి కాంబినేషన్ లో మరో సినిమా ప్రకటించే సరికి ఫ్యాన్స్ ఖుషీలో ఉన్నారు. వీరి నుండి చివరిగా ఖలేజా సినిమా వచ్చి పదకొండు సంవత్సరాలు అవుతుంది. అందుకే ఇప్పుడు మూడో సినిమా అనేసరికి ఫ్యాన్స్ లో ఉత్సాహం మాములుగా లేదు. ప్రస్తుతం వీరి సినిమా స్క్రిప్ట్ దశలో ఉన్నట్లు తెలుస్తుంది.ఇదిలా ఉండగా.. తాజాగా వీరి సినిమా పై సోషల్ మీడియాలో సినీ వర్గాలలో క్రేజీ న్యూస్ హల్చల్ చేస్తున్నాయి. విషయం ఏంటంటే.. మహేష్ – త్రివిక్రమ్ సినిమాకు తమన్ మ్యూజిక్ అందించనున్నాడు. అయితే తాజాగా ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుందని ఫ్యాన్స్ లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే ఇటీవలే మహేష్ బాబు తండ్రి సూపర్ స్టార్ కృష్ణ పుట్టినరోజు నాడు సినిమా ప్రారంభం కానుందని అనుకున్నారు. కానీ ఆరోజు నిరాశే మిగిలింది. ఇప్పుడు మరోసారి వార్తలు వచ్చేసరికి క్లారిటీ కావాలని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం.. వీరి సినిమా మహేష్ పుట్టినరోజున లాంచనంగా ప్రారంభం కానుందని టాక్. మరి చూడాలి ఈసారి అయినా అధికారికంగా ప్రకటిస్తారేమో. ప్రస్తుతం మహేష్ 'సర్కారు వారి పాట' సినిమా చేస్తున్నాడు.

# సూదికి భయపడే ఆయన మాఫియా సినిమాలెలా తీస్తాడు!?



సంఘంలో సింహంలా తిరిగేవాళ్లు కూడా వీధిలో కుక్కకు భయపడిపోతారు. చేలోకి వెళితే పాములు కరుస్తాయని భయపడే వాళ్లున్నారు. ఊరిలో పెద్ద మనుషులం అని చెప్పుకుని తిరిగేవాళ్లు చీకట్లో ఇంటెనక్కి వెళ్లేందుకు భయపడతారు.. ఇలా ఉంటుంది ఈ లోకం.ఇక్కడ ఈ బడా మాఫియా సినిమాల డైరెక్టర్ ని చూస్తుంటే అయ్యో పాపం అనిపించడం లేదూ? సూది మందుకే ఆయన అంత పరేషాన్ అయిపోతున్నారు. వ్యాక్సినేషన్ వేస్తుంటే అసలు సూది తనకు కనిపించకుండా ఆ కళ్లను అలా మూసేసుకుని దూరంగా జరిగాడు. ఇంతకీ ఈయన ఎవరు? అంటారా? ది గ్రేట్ పాన్ ఇండియా డైరెక్టర్ ప్రశాంత్ నీల్.కేజీఎఫ్ చిత్రంతో సంచలనాలు సృష్టించిన ఆయన ప్రస్తుతం సీక్వెల్ ని పెద్ద రేంజులో రిలీజ్ కి రెడీ చేస్తున్నాడు. అతడు తెరకెక్కించినవి భారీ మాఫియా సినిమాలు. తాడిని తన్నేవాడొకడొస్తే వాడి తలదన్నేవాడొకడొస్తాడు! అంటూ చాలా పెద్ద సందేశమే ఇచ్చాడు. మరి ఆయనేమో ఇలా వ్యాక్సిన్ వేస్తుంటే కళ్లు మూసేసుకున్నారేమిటి అంటూ ఆటపట్టిస్తున్నారు జనం.నిజానికి సూది మందు అంటే చాలా మందికి భయం. అందరిలోనూ ఆయనా ఒకడు. కానీ ఈ ఫన్ మూవ్ మెంట్ అరుదైనది అంటూ అభిమానులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. ఆయన సూదికి భయపడినా ఫర్వాలేదే కానీ కేజీఎఫ్ లాంటి భారీ మాఫియా యాక్షన్ సినిమాల్ని మాత్రం అస్సలు వదిలిపెట్టొద్దని సూచిస్తున్నారు. ప్రభాస్ ని సలార్ లో భారీ బంధిపోటుగా చూపిస్తున్నాడని యాక్షన్ పీక్స్ లో ఉంటుందని టాక్ ఉంది. మరి టీజర్ చూపిస్తాడేమో చూడాలి.

# రష్మిక లాక్ డౌన్ క్యూట్ లవ్



సౌత్ లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ రష్మిక మందన్నా. బాలీవుడ్ లో సైతం ప్రస్తుతం ఈమె రెండు సినిమాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. పుష్ప సినిమా తో పాన్ ఇండియా స్టార్ డంను దక్కించుకుంటానంటున్న ముద్దుగుమ్మ రష్మిక మందన్నా కరోనా లాక్ డౌన్ కారణంగా పలు సినిమాలు చేతిలో ఉన్నా కూడా ఇంటికే పరిమితం అయ్యి ఉంటుంది. సెలబ్రెటీలు తమ లాక్ డౌన్ టైమ్ ను ఎలా గడుపుతున్నామనే విషయాన్ని ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ వస్తున్నారు. తాజాగా రష్మిక మందన్న కూడా తన లాక్ డౌన్ టైమ్ ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది.తన పెట్ డాగ్ తో ఆట ఆడుకుంటూ సరదాగా దిగిన ఫొటోలను షేర్ చేసింది. ఈ విరామ సమయంలో నాకు లభించిన మంచి టైమ్ పాస్. నా పూర్తి సమయంను ఇక్కడే గడిపేస్తున్నాను. ఇదే నా క్యూటీ ఆరా. వారు దీన్ని చూస్తే మూడు సెకన్లలో ప్రేమలో పడతారని అన్నారు. కాని నేను మాత్రం అంతకంటే తక్కువ సమయంలోనే దీని ప్రేమలో పడ్డాను. నేను ఎప్పటికప్పుడు ఆరా గురించి మీకు అప్ డేట్ ఇస్తూ ఉంటాను అంటూ ఈ ఫొటోతో పాటు షేర్ చేసింది. ప్రస్తుతం నెట్టింట రష్మిక పెట్ డాగ్ ఆర చర్చనీయాంశంగా మారింది.పుష్ప సినిమా తో పాటు తమిళంలో ఒక స్టార్ హీరోతో ఈమె సినిమా చేస్తుంది. బాలీవుడ్ లో అమితాబచ్చన్ తో కలిసి నటించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇంకా పలు సినిమాలు కూడా ఈమె చేస్తోంది. షూటింగ్ లు మొదలు అయిన వెంటనే ఈమె పుష్ప తో జాయిన్ అవ్వబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. మరో వైపు ఈమె కన్నడంలో కూడా ఒకటి రెండు సినిమాల్లో నటిస్తున్నట్లుగా తెలుస్తోంది.

# మరో షెడ్యూల్ తో లవ్ స్టోరీ.. రిలీజ్ ప్లాన్??



దేశంలో కోవిడ్ కారణంగా విడుదలకు సిద్ధమైన సినిమాలు వరుసగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. వాయిదా వేయడం అయితే జరిగింది కానీ మళ్లీ రిలీజ్ ఎప్పుడనే విషయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అసలే కోవిడ్ సెకండ్ వేవ్ అనేది వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఇలాంటి తరుణంలో అక్కినేని హీరో నాగచైతన్య రిలీజ్ కు రెడీ చేసిన మూవీ గురించి చర్చలు జరుగుతున్నాయి. నిజానికి నాగచైతన్య నటించిన 'లవ్ స్టోరీ' మూవీ ఆల్రెడీ కరోనా కారణంగానే గతేడాది నుండి ఈ ఏడాదికి వాయిదాపడింది. తీరా ఇప్పుడు విడుదలకు అన్నివిధాలా రెడీ అయిపోయాక కరోనా మళ్లీ వచ్చి వాయిదా పడేలా చేసింది.ఈ ఏడాది లవ్ స్టోరీ మూవీని ఏప్రిల్ 16న విడుదలకు రంగం సిద్ధం చేసుకున్నారు మేకర్స్. కానీ సినిమా రిలీజ్ పై ప్రేక్షకులు ఓ రేంజిలో ఎక్సపెక్ట్ చేశారు. నాగచైతన్య కెరీర్లో ఈ సినిమా క్రియేట్ చేసినంత బజ్ ఏ సినిమా చేయలేదు. ఇప్పటికి ఇండస్ట్రీ దృష్టి 'లవ్ స్టోరీ' పైనే ఉంది. కానీ ఆ క్రెడిట్ అంతా చైతూ ఒక్కడిదే కాదు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల హీరోయిన్ సాయిపల్లవి సినిమాకు ఆ రేంజిలో బజ్ క్రియేట్ అయ్యేందుకు కారణం అయ్యారు. అయితే ఏప్రిల్ లో వాయిదా పడగానే లవ్ స్టోరీ సినిమా మే నెలలో విడుదల కాబోతుందని టాక్ బాగా నడిచింది. కానీ సెకండ్ వేవ్ అనేది మళ్లీ దెబ్బేసింది. కానీ ప్రస్తుతం కరోనా పరిస్థితి తగ్గుముఖం పడుతుండటంతో లవ్ స్టోరీ రిలీజ్ పై ఆసక్తి పెరుగుతోంది.తాజా సమాచారం ప్రకారం.. లవ్ స్టోరీ మూవీ మరో కొత్త డేట్ కు షిఫ్ట్ చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికే సినిమాలోని పాటలు అన్నికూడా సినిమా పై భారీ అంచనాలు సెట్ చేసాయి. ముఖ్యంగా సారంగదరియా సాంగ్ తెలుగు రాష్ట్రాలలో ఓ ఊపు ఉపేస్తోంది. కానీ సినిమా రిలీజ్ విషయంలో ఇంకా క్లారిటీ రాలేదు. ప్రస్తుతం అయితే లవ్ స్టోరీ మూవీ %వవ% ఏడాది ఆగష్టులో రిలీజ్ చేయనున్నట్లు టాక్. ఇప్పటికే సినిమా అన్నివిధాలా సిద్ధం అయిపోయింది. ఆగస్టు వరకు పరిస్థితి మాములుగా మారి థియేటర్స్ ఓపెన్ చేస్తే వెంటనే రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. ప్రస్తుతం నాగచైతన్య డైరెక్టర్ విక్రమ్ దర్శకత్వంలో థాంక్యూ అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే షూటింగ్ కూడా కంప్లీట్ అయింది. చూడాలి మరి ఈసారి నాగచైతన్య అదృష్టం ఎలా ఉందో!

# సీఎం కోడలు మూడవ ప్రయత్నం



తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కోడలు.. ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ భార్య కృతిక ఉదయనిధి గతంలో రెండు సినిమాలకు దర్శకత్వం వహించారు. భర్త ఉదయనిధి సినిమాలకు ఆమె నిర్మాతగా కూడా వ్యవహరించారు. మల్టీ ట్యాలెంటెడ్ అంటూ ఇండస్ట్రీలో పేరు దక్కించుకున్న కృతిక ఉదయనిధి దర్శకురాలిగా మూడవ సినిమాను మొదలు పెట్టింది. ఇప్పటికే దర్శకురాలిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న ఈమె ఈసారి కమర్షియల్ సక్సెస్ ను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తమిళ మీడియా వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.కాళిదాసు జయరాం హీరోగా తాన్య రవిచంద్రన్ హీరోయిన్ గా కృతిక దర్శకత్వంలో ఒక రొమాంటిక్ ప్రేమ కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

నేటి పత్రిక ప్రజా వార్త, తెలుగువారపత్రిక
Neti Patrika Praja vartha,Telugu Weekly
విజయవాడ, 8-15 జూన్ 2021

# ప్రజలు,ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పాత్రికేయుల సహకారం మరువలేను :జిల్లా కలెక్టర్



మచిలీపట్నంనేటి పత్రిక ప్రజా వార్త ::ప్రజలకు చేయగల్గినంత చేశాననే సంతృప్తితో జిల్లా నుండి వెళుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ బదిలీ సందర్భంగా జరిగిన విడ్కోలు సమావేశంలో మచిలీపట్నం పాత్రికేయులు, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్‌జివో నాయకులు తదితరులు పాల్గొని జిల్లా కలెక్టరును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో 2 సంవత్సరాల 4 నెలలు ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం అనందాన్ని కలిగించిందని అన్నారు. 2019 మార్చి, ఏప్రిల్ మాసాల్లో శాసన సభ, పార్లమెంటు ఎన్నికలు అందరి సహకారంతో సమర్దవంతంగా నిర్వహించామన్నారు. ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం తన కెరీర్ లో తీపిగుర్తుగా నిలిచిపోతుందన్నారు. ఎన్నో యేళ్ల తరువాత కృష్ణానదికి సంభవించిన వరదలుకు, నివారణ చర్యలు తీసుకోవడంలో అందరు సహకరించారన్నారు. రాష్ట్ర గవర్నర్ గారి ప్రమాణ స్వీకారోత్సవంతో పాటు ఇద్దరు ప్రధాన న్యాయ మూర్తుల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నమన్నారు. కోవిడ్ మొదటి వేవ్‌లో కంటైన్‌మెంట్ పటిష్ట నిర్వహణ, సెకండ్ వేవ్‌లో ఆసుపత్రులలో కోవిడ్ రోగులకు చికిత్స అందించడం చేయడం ద్వారా కోవిడ్ పాజిటివిటి రేటు తగ్గించగలిగామని, ఇప్పటిదాకా జిల్లాలో కోవిడ్ పాజిటివ్ లక్ష దాటలేదని అన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా చేయుటకు నేను సైతం కృష్ణమ్మ

## కృష్ణాజిల్లాలో పని చేయడం ఎంతో అనుభూతి నిచ్చింది.

శుద్ధిసేవలో కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, కోవిడ్ కారణంగా ఈ కార్యక్రమానికి అంతరాయం కలిగిందన్నారు. జిల్లాలో నవరత్నాల అమలు, 3.30 లక్షల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ, 16 వేల మందికి సచివాలయ ఉద్యోగ నియమకాలు వంటి ముఖ్య కార్యక్రమాలు కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. కృష్ణాజిల్లాలో పని చేయడం ప్రజలందరికి సేవచేసే భాగ్యం కలగడం ప్రజలందరికి, ప్రజాప్రతినిధులకు అధికారులు ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

తొలుత జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహం వద్ద



మొక్క నాటారు.

డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ డివో ఎన్ఎస్ కె. ఖాజావలి, ఎవో వెన్నెల శ్రీనివాస్, తహసిల్దార్ డి. సునీల్ బాబు, రెవిన్యూ సర్వీసు అసోసియేషన్ ప్రతినిధులు శ్యామ్, ఎన్‌జివో నాయకులు పలువురు పాత్రికేయులు జిల్లా కలెక్టరు గత రెండేళ్లుగా జిల్లాలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వి వరిస్తూ కలెక్టర్ సేవలను కొనియాడారు.

కలెక్టర్ ను అభినందించిన జిల్లా ఎస్పిః-

జిల్లా ఎస్పి. ఎం. రవీంద్రనాద్‌బాబు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ను కలసి పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాకు ప్రజలకు చేసిన సేవల గురించి కొనియడారు.

# బొమ్మినంపాడు వద్ద క్రాంప్ బెల్ కాలువ పై రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిన...ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

ముదినేపల్లి, నేటి పత్రిక ప్రజా వార్త :పతి గ్రామంలో అభివృద్ది సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత నిస్తూ నిధులను మంజూరు చేసి ఆయా పథకాలు ద్వారా చేపట్టే పనులను త్వరిత గతిన పూర్తి చేయడం జరుగుతుందని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ముదినేపల్లి మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలో శ్రీ నాగమ్మ తల్లి దేవస్థానం ఎదురుగా ఉన్న క్రాంప్ బెల్ కాలువ పై రూ. 10 లక్షలు యంపీ ల్యాడ్ నిధులతో కాలిబాట వంతెన నిర్మాణానికి శాసనసభ్యులు డిఎన్ఆర్ స్థానిక నాయకులు, అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మినంపాడు గ్రామం నుండి నడకదారిగా మెయిన్ రోడ్డుకు వెళ్లేలంటే క్యాంప్ బెల్ కాలువ మీదుగానే వెళ్లాలన్నారు. ఈక్రమంలో గ్రామ ప్రజలఇబ్బందులు తీర్చేందుకు రూ. 10 లక్షలు వ్యయంతో వంతెన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. తొలుత గ్రామంలో నెలకొని ఉన్న నాగమ్మ తల్లి అమ్మవారిని దర్శించికొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దేవస్థానం ప్రాంగణంలో ఎమ్మెల్యే డిఎన్ఆర్ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈఈ పగడాల సురేష్, ఇరిగేషన్ డీఈఈ గణపతి, ఇరిగేషన్ ఏఈఈ సత్యనారాయణ పీఆర్ ఏ ఈఈ శ్రీనివాసరావు, సర్పంచ్ దారం సుధా, స్థానిక నాయకులు దాసరి అరుణమ్మ, బొర్రా శేషుబాబు, ఎంపీపీ



అభ్యర్థి రామిశెట్టి సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా చైర్మన్ కరేటి గోవిందరాజు,దాసరి చిరంజీవి, కోట సత్యనారాయణ, పేటేటి లక్ష్మికుమారి, సాక్షి సాయిబాబు, దాసి రంగారావు, నేతల మరియరాజు, పాలంకి వెంకటేశ్వరరావు, రాచూరి కుమార్, పాలంకి వెంకట సత్యనారాయణ, దామెర శ్రీకాంత్, సత్యనారాయణ, విన్నకోట సుబ్బారావు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న మంత్రి కొడాలి నాని

-ఇప్పుడాయన కల గుడివాడలో ప్రభుత్వ మెడికల్ కళాశాల

-నియోజకవర్గంలో పేదల కోసం 450 ఎకరాలు

-మధ్యతరగతి కోసం మరో 400 ఎకరాల భూములు

-రూ. 300 కోట్లతో మూడు మండలాలకు మల్టీవిలేజ్ స్కీం

-రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రూ.200 కోట్ల మంజూరు

-గుడివాడలో జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏర్పాటుకు చర్యలు



గుడివాడ,నేటి పత్రిక ప్రజా వార్త :: కృష్ణాజిల్లా గుడివాడలో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలన్నది రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) కలగా కన్పిస్తోంది. గత 15 ఏళ్ళలో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చినా ప్రతిపక్షానికే పరిమితమయ్యారు. అయినా ఆయనలోని పోరాట పటిమ తగ్గలేదు. 2019 లో నాల్గవసారి కూడా ఎమ్మెల్యేగా విజయం సాధించి సీఎం జగన్మోహనరెడ్డి కేబినెట్ లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. 2004 లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే నాటికి గుడివాడ నియోజకవర్గాన్ని ఇళ్ళస్థలాల సమస్య పట్టి పీడిస్తోంది. 2007 వరకు అనేక రూపాల్లో ఉద్యమాలు చేస్తూ వచ్చారు. చివరకు గుడివాడ నుండి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసి అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని ఇచ్చి వచ్చారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ గుడివాడలో ఇళ్ళస్థలాల సమస్య ఉందని గుర్తించిన దివంగత రాజశేఖరరెడ్డి 2008 లో గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం పరిధిలో 77 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇచ్చారు. దీంతో అప్పటి వరకు ఎన్టీఆర్ అంటేనే అభిమానం చూపే కొడాలి నాని వైఎస్సార్ పై కూడా అభిమానాన్ని పెంచుకున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా గుడివాడ నియోజకవర్గానికి ఏం చేయలేకపోయాననే అసంతృప్తి మాత్రం కొడాలి నానిలో కన్పిస్తూ వచ్చేది. అయినప్పటికీ గుడివాడ ప్రజలు మాత్రం ఆయన ఏ పార్టీలో నిలబడినా గుండెల్లో పెట్టుకుంటూ వస్తున్నారు. దేశ చరిత్రలో పేదల ఇళ్ళ కోసం ఒక్క నియోజకవర్గానికి 450 ఎకరాల భూమిని ఇచ్చిన దాఖలాలు లేవు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగన్మోహనరెడ్డిలు గుడివాడ నియోజకవర్గంలో పేదల కోసం 450 ఎకరాల భూమిని కేటాయించారని మంత్రి కొడాలి నాని గర్వంగా చెబుతున్నారు. గుడివాడ పట్టణంలోని పేదల కోసం 2008 లో దివంగత రాజశేఖరరెడ్డి 77 ఎకరాల భూములిస్తే, సీఎం జగన్మోహనరెడ్డి ఈ రెండేళ్ళ కాలంలో ఏకంగా 181 ఎకరాల భూములను కొనుగోలు చేయించారు. దివంగత రాజశేఖరరెడ్డి ఇచ్చిన 77 ఎకరాల్లో ప్రస్తుతం 8,912 టీడ్కో గృహాలను నిర్మిస్తున్నారు. మధ్యతరగతి ప్రజల కోసం గుడివాడ పట్టణంలో జగనన్న స్మార్ట్ టౌన్ లేఅవుటకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం దొండపాడు రోడ్డులో దాదాపు 400 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ కే మాధవీలతతో కలిసి పలుమార్లు సమావేశమై భూసేకరణ వంటి అంశాలపై కసరత్తును పూర్తిచేశారు. పట్టణ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరలకే ప్లాటు కేటాయించనున్నారు. లేఅవుట్లను ప్రభుత్వమే అభివృద్ధి పరుస్తుందని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా లాటరీ పద్ధతిన ప్లాట్ల కేటాయింపు జరుగుతుందని మంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు. రూ.300 కోట్లతో మల్టీవిలేజ్ స్కీంకు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను సిద్ధం చేశారు. ఈ రిపోర్ట్ ను ప్రభుత్వానికి కూడా పంపారు. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని 68 గ్రామాలు, శివారు ప్రాంతాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఇందు కోసం జనార్ధనపురం పాములపాడు పంచాయతీ పరిధిలో 120 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. అక్కడే ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, పంప్ హౌస్, ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్స్, సంప్ వెల్, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్, వాచ్ మెన్ క్వార్టర్స్ వంటివి నిర్మించనున్నారు. ఇక్కడే నీటిని శుద్ధి చేసి పైప్ లైన్ల ద్వారా గుడివాడ రూరల్, నందివాడ, పెదపారుపూడి మండలాల్లోని 68 గ్రామ పంచాయతీలు, శివారు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. అక్కడి నుండి పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందజేస్తారు. కెపాసిటీ చాలని గ్రామాల్లో 46 ట్యాంక్లను కూడా నిర్మించనున్నారు. 30 ఏళ్ళ వరకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఈ ప్రాజెక్టు డిజైన్ చేసినట్టు మంత్రి కొడాలి నాని వివరించారు. గుడివాడ పామర్రు జాతీయ రహదారి పై ఉన్న గుడి వాడ భీమవరం, గుడివాడ మచిలీపట్నం రైల్వే ట్రాక్ పై రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ రెండు ఫ్లైఓవర్ల నిర్మాణం పూర్తయితే ఎన్నో ఏళుగా కొనసాగుతూ వస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతం ఫ్లైఓవర్ల నిర్మాణానికి సంబంధించి డిజైన్లను రూపొందిస్తున్నారు. కొద్దిరోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుండి ఫైనల్ ఆర్డర్ రానుందని మంత్రి కొడాలి నాని తెలిపారు. ఇదిలా ఉండగా మచిలీపట్నానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల రావడంతో అక్కడ ఉన్న జిల్లా ప్రభుత్వాసుపత్రిని గుడివాడకు తీసుకువచ్చేందుకు మంత్రి కొడాలి నాని తీసుకున్న చర్యలు ఫలించాయి. సీఎం జగన్మోహనరెడ్డి కూడా ఇందుకు అంగీకరించడంతో గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం పరిధిలోని 181 ఎకరాల లేఅవుట్ లో దాదాపు 10 ఎకరాల భూమిని మంత్రి కొడాలి నాని సిద్ధం చేశారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి ఉంటే భవిష్యత్తులో ప్రభుత్వ మెడికల్ కళాశాల వచ్చే అవకాశం ఉందని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్న మంత్రి కొడాలి నాని తన కలను నిజం చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు.

# గుడివాడ నియోజకవర్గంలో రెండేళ్ళలో రూ. 337.66 కోట్ల అభివృద్ధి

-1.27 లక్షల లబ్ధిదారులకు రూ.149 కోట్ల సంక్షేమం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని

గుడివాడ, జూన్ 7: గుడివాడ నియోజకవర్గంలో గత రెండేళ్ళ కాలంలో రూ.337.66 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, సంక్షోభంలో సంక్షేమానికి కూడా అత్యధిక ప్రాధాన్యమిచ్చామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. సోమవారం కృష్ణాజిల్లా గుడివాడలో మంత్రి కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో డ్రైన్ల నిర్మాణానికి రూ.23.39 కోట్ల నిధులు, జలజీవన్ మిషన్ నిధులు రూ. 110.57 కోట్లు, నియోజకవర్గానికి రూ. 82 లక్షల ప్రత్యేక నిధులు, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ. 46.36 కోట్లు, నాడు నేడులో భాగంగా స్కూల్స్ అభివృద్ధికి రూ. 11.67 కోట్లు, ఆర్ అండ్ బీ నిధులు రూ.47,02 కోట్లు, మెడికల్ సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ. 4 కోట్లు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణానికి రూ. 8. 27 కోట్లు, గ్రామ సచివాలయాల నిర్మాణానికి రూ. 15.20 కోట్లు, పీఎంజేఎస్ రోడ్ల నిర్మాణానికి రూ. 11.06 కోట్లు, గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే దీర్ఘకాలంగా ఎన్నికల హామీకే పరిమితమవుతూ వస్తున్న గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. సీఎం జగన్మోహనరెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరగా రూ.32.50 కోట్ల ప్రభుత్వ నిధులను మంజూరు చేశారని తెలిపారు. అంతేగాక గుడివాడ కంకిపాడు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైందని, ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 16.10 కోట్లను మంజూరు చేయించానని చెప్పారు. గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన పురాతన భవనం శిథిలమైందని, దీని స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు రూ.10.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వీటిలో



కొన్ని పనులు పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా గుడివాడ నియోజకవర్గంలో 38 వేల 010 మంది లబ్ధిదారులకు రూ. 128.76 కోట్ల వైఎస్సార్ ఆసరా, 12 వేల 521 మంది లబ్ధిదారులకు రూ. 8.22 కోట్ల రైతుభరోసా, 72 వేల 600 మంది లబ్ధిదారులకు రూ.7.30 కోట్ల కరోనా అలవెన్స్, 1,599 మంది లబ్ధిదారులకు రూ.1.59 కోట్ల వాహనమిత్ర ఆర్థికసాయం, 1,543 మంది లబ్ధిదారులకు రూ .2.31 కోట్ల కాపునేస్తం, 669 మంది లబ్ధిదారులకు రూ.48 లక్షల టైలర్స్ నేస్తం, 181 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల నాయిబ్రాహ్మణ నేస్తం, 141 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల రజక నేస్తం, 75 మంది లబ్ధిదారులకు రూ.20 లక్షల నేతన్న నేస్తం అందజేశామని చెప్పారు. గుడివాడ నియోజకవర్గంలో 26 వేల 983 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా 1 వ తేదీన వైఎస్సార్ పెన్షన్లను అందజేస్తున్నట్టు మంత్రి కొడాలి నాని చెప్పారు.

# ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యేలా కృషి చేస్తా.

## ప్రతి అర్హునికీ పథకాలు అందాల్సిందే. మంత్రి కన్నబాబు



కాకినాడ , నేటి పత్రిక ప్రజా వార్త : గ్రామ స్వరాజ్యం సాకారం లక్ష్యంగా ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యేలా కృషిచేస్తూ, గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కురసాల కన్నబాబు స్పష్టం చేశారు. సోమవారం కాకినాడ రమణయ్యపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో కాకినాడ గ్రామీణ మండల ప్రజాపరిషత్ సమీక్షా సమావేశం జరిగింది. కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు, ఆయా గ్రామాల పంచాయతీకార్యదర్శులు పాల్గొన్న ఈ సమావేశానికి మంత్రి కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి ఆయా గ్రామాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల గ్రామ ప్రథమ పౌరులుగా ఎన్నికైన సర్పంచ్‌లకు అభినందనలు తెలియజేస్తున్నానని, ప్రజలకు సేవ చేసే విషయంలో పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థల పనితీరుపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. నేరుగా నగదును జమజేసే దాదాపు 22 పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో పూర్తి అప్రమత్తత అవసరమని సూచించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాల శాశ్వత భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాలని.. నిర్మాణాలు ప్రారంభం కానివాటి విషయంలో కారణాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఏ సహాయం కావాలన్నా తాను 24 గం. అందుబాటులో ఉంటానని మంత్రి వెల్లడించారు.

ప్రతి అర్హునికీ పథకాలు అందాల్సిందే:

ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హునికి అందేలా చూడాలని, లబ్ధిదారుని ఎంపికకు అర్హత ఒక్కటే ప్రాతిపదిక అని మంత్రి స్పష్టం చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రెయిన్ల శుద్ధి, రహదారులు తదితరాల్లో పోటీతత్వంతో పనిచేసి ప్రతి గ్రామం నెం.1గా నిలిచేందుకు కృషిచేయాలని తద్వారా నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలపాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన సర్పంచ్‌లు, అధికారులను సత్కరించనున్నట్లు వెల్లడించారు. నాడు-నేడు రెండోదశకు సంబంధించిన పాఠశాలలను గుర్తించి, నివేదిక ఇవ్వాలన్నారు. తూరంగి నీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. మండల, గ్రామ వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం కోవిడ్ విపత్తు నేపథ్యంలో మనల్ని మనం పరిరక్షించుకుంటూ ప్రజల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, అందరికీ వీలైనంత త్వరగా టీకా అందించాలనేది ముఖ్యమంత్రి ఆశయమని పేర్కొన్నారు. ఈ దిశగా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. సమావేశం అనంతరం మంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు అయిన సందర్భంగా మంత్రిని ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. అదే విధంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను మంత్రి కురసాల కన్నబాబు శాలువాలతో సత్కరించారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ గీసాల శ్రీను, ఎంపీడీవో పి నారాయణమూర్తి, తహసీల్దార్ వి మురళీకృష్ణ, ప్రత్యేక అధికారి పద్మశ్రీ, గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కొవాగ్జిన్ కంటే కొవిషీల్డ్ తోనే ఎక్కువ యాంటీ బాడీలు




-కేవలం కొవిషీల్డ్ ఒక్క డోసుతోనే 70శాతం రక్షణ

-ఎక్కువ కాలం ఉండేది కూడా కొవిషీల్డ్ మాత్రమే

-కొవిషీల్డ్ వేసుకుంటే ప్రాణ భయం పోయినట్టే

విజయవనేటి పత్రిక ప్రజా వార్త ::కరోనా వైరస్ నివారణకు ప్రస్తుతం ఇండియాలో రెండు వ్యాక్సిన్లు ఇస్తున్నారు. అందులో ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకాకు చెందిన కొవిషీల్డ్ ఒకటి కాగా.. హైదరాబాద్ భారత్ బయోటెక్‌కు చెందిన కొవాగ్జిన్ మరొకటి. ఈ రెండు వ్యాక్సిన్లు కరోనా నుంచి రక్షణ కల్పించడంలో అద్భుతంగా పని చేస్తున్నట్లు తాజాగా జరిగిన అధ్యయనం తేల్చింది. ఇండియాలో డాక్టర్లు, నర్సులతో కూడిన తొలి అధ్యయనం ఇది. దీనిని ఇంకా ప్రచురించాల్సి ఉంది. డాక్టర్ ఏకే సింగ్, ఆయన సహచరులు ఈ అధ్యయనం నిర్వహించారు. కొవిషీల్డ్ తొలి డోసు వేసుకున్న తర్వాత 70 శాతం రక్షణ కలుగుతున్నట్లు ఈ అధ్యయనం తేల్చగా.. కొవాగ్జిన్ మూడో దశ ట్రయల్స్ ప్రాథమిక సమాచారాన్ని బట్టి 81 శాతం సమర్థంగా పని చేస్తోంది.

కొవిషీల్డ్‌తోనే ఎక్కువ యాంటీబాడీలు

రెండు వ్యాక్సిన్లు సమర్థంగానే పని చేస్తున్నా.. యాంటీబాడీల విషయానికి వస్తే మాత్రం కొవిషీల్డ్‌తోనే ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 515 మంది ఆరోగ్య కార్యకర్తలపై ఈ అధ్యయనం నిర్వహించారు. వీళ్లలో 305 మంది పురుషులు, 210 మంది మహిళలు ఉన్నారు. వీళ్లు ఈ వ్యాక్సిన్ల రెండు డోసులు తీసుకున్నారు. మొత్తం 425 మంది కొవిషీల్డ్ తీసుకున్న వాళ్లలో 98.1 శాతం, 90 మంది కొవాగ్జిన్ తీసుకున్న వాళ్లలో 80 శాతం సెరోపాజిటివిటీ (ఎక్కువ యాంటీబాడీలు) కనిపించింది.

రెండు వ్యాక్సిన్లు రెండు డోసుల తర్వాత మంచి రోగనిరోధక వ్యవస్థను అందిస్తున్నా.. సెరోపాజిటివిటీ రేట్లు, సగటు యాంటీ-స్పైక్ యాంటీబాడీ టైటర్‌ల విషయంలో కొవిషీల్డ్ చాలా మెరుగ్గా ఉన్నట్లు గుర్తించారు. దీనికోసం యాంటీబాడీ టైటర్ బ్లడ్ టెస్టులు చేశారు. ఇది రక్తంలో యాంటీబాడీల ఉనికితోపాటు వాటి స్థాయిని కూడా చెబుతాయి. దీని ప్రకారం కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకున్న వాళ్లలో యాంటీబాడీ టైటర్ 115 %ాఖ/ఎశ్రీ% (ఆర్బిట్రరీ యూనిట్స్ పర్ మిల్లీలీటర్)గా ఉండగా.. కొవాగ్జిన్ తీసుకున్న వాళ్లలో 51 %ాఖ/ఎశ్రీ%గా ఉంది. ఆ లెక్కన కొవాగ్జిన్ కంటే కొవిషీల్డ్‌లో యాంటీబాడీల సంఖ్య చాలా ఎక్కువని ఈ అధ్యయనం తేల్చింది. అయితే మొత్తంగా రెండు వ్యాక్సిన్లు కరోనాపై అద్భుతంగా పని చేస్తున్నాయని, దేశంలో మూడో దశ కరోనా రాకుండా ఉండాలంటే వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగం పెంచడం ఒక్కటే మార్గమని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 16013, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.